## క్లుప్తంగా

### తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



సోమశిల(ఆత్మకూరు): అనంతసాగరం మండల తహసీల్దార్‌గా బీ సుభాషిణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ అవకతవకలకు పాల్పడడంతో గత నెలలో కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఆత్మకూరు తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం అనంతసాగరం తహసీల్దార్‌గా సుభాషిణిని నియమించడంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. కాగా ఆమె ఎన్నికలకు ముందు అనంతసాగరం తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు.

**చేజర్ల తహసీల్దార్‌గా మురళి**



చేజర్ల: మండల నూతన తహసీల్దార్‌గా బీ మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఏవీ రమణారావు ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఇందుకూరుపేట మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మురళి పదోన్నతిపై తహసీల్దార్‌గా వచ్చారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

### పీహెచ్‌సీలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



సీతారామపురం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు సోమవారం తనిఖీ చేశారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, హెచ్ఎంఐఎస్, ఆర్సీహెచ్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్షించారు. టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు రమేష్, షైనీ, వైద్యాధికారిణి స్వప్నరెడ్డి, వైద్య సిబ్బంది, హెల్త్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### మర్యాదపూర్వకంగా..



ఉదయగిరి: అమరావతిలో రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ విజయకుమార్‌ను ఉదయగిరి ప్రాంతానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్, స్వచ్ఛ సేవా, ప్రకృతి వ్యవసాయం, అటవీ సంరక్షణ, జీవనోపాధి కల్పన కోసం కృషి చేయాలని ఎన్జీఓలను ఆయన కోరారు. రాష్ట్ర ఎన్జీఓ సంఘ సమాఖ్య అధ్యక్షుడు పీవీ రమణయ్య, కార్యదర్శి ప్రకాశ్, పీఎస్ మూర్తి, గాలిబ్ తదితరులు ఉన్నారు.

### డైనింగ్ టేబుళ్ల ఏర్పాటు



ఆత్మకూరు: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంచి పరమేశ్వరరెడ్డి నిత్యాన్నదానం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే రోగులు, వారి బంధువులు ప్లేట్లు పట్టుకుని భోజనం చేసేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పరిశీలించిన పలువురు దాత దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. అన్నదాన ప్రాంగణంలో డైనింగ్ టేబుళ్లను సోమవారం ఏర్పాటు చేయించారు.

### పేదలకు రగ్గుల పంపిణీ



వరికుంటపాడు: వరికుంటపాడు, కనియంపాడులో బొగ్గు బట్టీల్లో పనిచేస్తున్న కూలీలు, ఆండ్రావారిపల్లి, బోయమడుగుల ఎస్టీ కాలనీల్లోని పేదలకు మద్దినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి రఘురాం మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలకు రగ్గులను వితరణ చేసినట్లు తెలిపారు. ట్రస్టు సభ్యులు రవికుమార్, నాయబ్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### హెచ్‌ఐవీ బాధితురాలికి చేయూత

కావలి: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గొల్లమూడివారి వీధిలోని నలంద ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు హెచ్‌ఐవీ బాధితురాలికి సోమవారం చేయూతనందించారు. స్థానిక నివాసం ఉంటున్న బాధితురాలికి దుప్పట్లు, చీరలు, పండ్లు, పోషకాహారం, తదితరాలను అందజేశారు. బాధితురాలికి మానవత్వంతో చేయూతనందించిన విద్యార్థులు, అందుకు సహకరించిన తల్లిదండ్రులను ఉపాధ్యాయులు అభినందించారు.

# రోగాల ముసురు

- మారిన వాతావరణ పరిస్థితులు
- వర్షాలకు తోడు వీస్తున్న చలిగాలులు
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు



తుమ్మలపెంట పీహెచ్‌సీలో ఓపీ రాయించుకుంటున్న రోగులు

కావలి: వాతావరణం మారింది. వర్షాలకు తోడు చలిగాలులు వీస్తున్నాయి. చల్లని..తేమ వాతావరణం మన ఆరోగ్యంపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. సాధారణంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ముసిరి ఇబ్బంది కలిగిస్తాయి. అందులో కొన్ని ప్రాణాంతకమైనవి ఉంటాయి. వర్షాలకు నీరు నిల్వ ఉండడం, ఉష్ణోగ్రతలు పడిపోవడం, తదితర కారణాలతో బ్యాక్టీరియా, వైరస్‌ల వ్యాప్తికి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఇవి గాలి, నీరు, ఆహారం ద్వారా మన శరీరంలోకి ప్రవేశించి వేగంగా వృద్ధి చెందుతాయి. దీనికి తోడు వర్షాకాలంలో శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల సీజనల్ వ్యాధులు ముసిరే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల బారి నుంచి బయటపడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలకు తోడు చలిగాలులు వీస్తుండడంతో జ్వరం, జలుబు, దగ్గు, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన ప్రజలు ఎక్కువగా పడుతున్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీలకు వస్తున్న కేసుల్లో ఎక్కువగా ఇవే ఉంటున్నాయి. కావలి మండలం తుమ్మలపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం 60 నుంచి 70 మంది వరకు రోగులు వస్తున్నారు. ఓ పక్క గ్రామాల్లో 104 వాహన సేవలు, మరోపక్క ఏఎన్ఎంలు, ఆశావర్కర్ల ద్వారా మందులు అందిస్తున్నప్పటికీ వాటితో రోగాలు తగ్గక నేరుగా పీహెచ్‌సీకే వస్తున్నారు. ప్రధానంగా జ్వరం, జలుబు, దగ్గు, దురద, శ్వాసకోశ సమస్యలతో వస్తున్న రోగుల తాకిడి పెరిగింది. పీహెచ్‌సీలో వైద్యులతో పాటు ల్యాబ్ అందుబాటులో ఉండడంతో వైద్యపరీక్షలు చేయించుకుని మందులు పొందుతున్నారు.



జ్వరంతో చికిత్స పొందుతున్న మహిళ

#### చిన్నచిన్న జాగ్రత్తలతో వ్యాధులకు దూరం

- వర్షాకాలంలో చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధుల బారినుంచి బయటపడవచ్చని వైద్యులు చెబుతున్నారు.
- వర్షాకాలంలో తాగునీరు కలుషితమవుతుంది.ఆ నీటిని తాగడం వల్ల టైఫాయిడ్ జ్వరం వచ్చే అవకాశం ఉంది. అలాగే కలుషిత ఆహారం, నీటితో డయేరియా బారినపడే ప్రమాదం ఉంది. అందువల్ల కాచి చల్లార్చిన నీటిని, పరిశుభ్రమైన వేడి ఆహారాన్ని తీసుకోవాలి.
- దోమలతో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు సోకుతాయి. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, దోమ తెరలు వాడడం ద్వారా రక్షణ పొందవచ్చు.
- వర్షాలకు తడవడం, గాలిలో తేమ ఎక్కువగా ఉండడం వల్ల దగ్గు, జలుబు, గొంతునొప్పి, శ్వాసకోశ సమస్యల బారిన పడే ప్రమాదం ఉంది. సీఓపీడీ సమస్యలు ఇబ్బందులు పెట్టే అవకాశం ఉంది. వాటి నుంచి రక్షణకు స్వెట్టర్లు, మంకీక్యాప్‌లు, మాస్కులు ధరించాలి. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. ముఖ్యంగా సిట్రస్ జాతికి చెందిన ఉసిరి, నిమ్మకాయల రసం తీసుకోవాలి. ఎక్కువగా నీటిని తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం మరింత మంచిది.

#### జలుబు, దగ్గుతో వచ్చా



జలుబు, దగ్గుతో బాధపడుతున్నా. మూడు రోజులుగా ఊపిరాడనివ్వడం లేదు. దగ్గలేక చస్తున్నా. మాత్రలు వేసుకున్నా ఫలితం లేకపోవడంతో పీహెచ్‌సీకి వచ్చా.

–తాయమ్మ, చినరాముడుపాళెం

#### జ్వరంతో బాధపడుతున్నా



నాలుగు రోజులు నుంచి జ్వరం తగ్గడం లేదు. పగలు మామూలుగా ఉంటోంది. రాత్రి పూట శరీరం కాలిపోతోంది. మాత్రలు వేసుకున్నా తగ్గలేదు. డాక్టర్‌కు చూపించుకుందామని వచ్చా.

–యశోదమ్మ, కొత్తసత్రం, కావలి మండలం

#### ఒకటే ఆయాసం



వర్షానికి తోడు చలిగాలి ఎక్కువవడంతో ఒకటే ఆయాసం. శ్వాస పీల్చుకోవడం కష్టంగా ఉంది. రాత్రుళ్లు నిద్ర పోలేకున్నా. రెండు రోజులుగా సమస్య ఎక్కువగా ఉండడంతో డాక్టర్ వద్దకు వచ్చా.

–శీనయ్య, పెద్ద రాముడుపాలెం, కావలి మండలం

#### జాగ్రత్తలు పాటించాలి



చలితీవ్రత నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటినీరు, చల్లారిన ఆహారాన్ని తీసుకోరాదు. కాచిచల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవాలి. ఉన్ని దుస్తులను ధరించాలి. చలిగాలులకు చిన్నారులను బయట తిప్పకూడదు. ఎక్కువ రోజులు జ్వరం, జలుబు, దగ్గు, ముక్కు నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– ఏ అనిల్‌కుమార్, వైద్యాధికారి, తుమ్మలపెంట పీహెచ్‌సీ

### సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని వినతి

ఉదయగిరి: ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని మండలంలోని సర్వరాబాదుకు చెందిన దళిత రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సుభద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 1977లో ఏడుగురికి 10.50 ఎకరాలను సీజేఎఫ్ఎస్ కింద పంపిణీ చేసిందని తెలిపారు. అప్పటి నుంచి భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. 2018లో సీజేఎఫ్ఎస్ భూములను డీకేటీగా మార్చే సమయంలో తమకు పట్టాలు ఇవ్వలేదని విన్నవించారు. ఈ విషయాన్ని స్థానిక అధికారులతో పాటు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళితే సాగు చేసుకోవాలని, తర్వాత పట్టాలు ఇస్తామన్నామని విన్నవించారు. అప్పటి నుంచి వరి, ఇతర పైర్లు సాగు చేసుకుంటుండగా మూడ్రోజుల క్రితం ప్రభుత్వ భూమి అంటూ అధికారులు నోటీస్ బోర్డు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఉదయగిరిలోని నెల్లూరు, కావలి రోడ్డు మార్గాల్లో ఉన్న రెండు బీసీ కాలనీల్లో ప్రత్యేకంగా రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు స్థానికులు వినతి పత్రం అందజేశారు.

### నేడు దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

వింజమూరు(ఉదయగిరి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వింజమూరులోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 146 మంది దివ్యాంగులకు మంగళవారం ట్రైసైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు ఆ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

## వర్షానికి మునిగిన నారుమళ్లు, నాట్లు



ఆత్మకూరులో మునిగిన నాట్లు వేసిన పొలాలు



అల్లూరు: నాట్లను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

అల్లూరు: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు అల్లూరు మండల వ్యాప్తంగా 257 ఎకరాల్లోని వరినాట్లు మనకకు గురైనట్లు ఏడీఏ నాగరాజు తెలిపారు. గోగులపల్లి పంచాయతీ పరిధిలోని చంద్రశేఖరపురంలో వర్షాలకు మునకకు గురైన వరినాట్లను సోమవారం ఆయన క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడేరు డ్రెయిన్ పొంగడంతో చంద్రశేఖరపురం, పురిణి గ్రామాల పరిధిలో 63 మంది రైతులకు సంబంధించిన 257 ఎకరాల్లోని వరి నాట్లు మునిగాయని తెలిపారు. రైతులు పంటలకు బీమా చేసుకుంటే విపత్తులతో నష్టపోతే పరిహారం అందుతుందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఎకరాకు రూ.168 ప్రీమియాన్ని చెల్లిస్తే, విపత్తులతో నష్టం జరిగితే రూ.42వేలు పరిహారం అందుతుందని వివరించారు. ఆయన వెంట ఏఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు ఉన్నారు.

ఆత్మకూరు: మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణ పరిధిలోని బట్టేపాడు మార్గంలోని పొలాల్లో వేసిన వరి నాట్లతో పాటు నారుమడులు మునిగాయి. ఎగువ పొలాల నుంచి వచ్చిన వర్షపు నీరు దిగువన కాలువల్లో నిలిచిపోయింది. దీంతో దిగువన ఉన్న సుమారు 110 ఎకరాల్లోని వరి నాట్లు నీట మునిగాయి. 200 ఎకరాలకు సరిపడా నారుమడులు నీటమునిగాయని రైతులు తెలిపారు. మరో రెండు రోజులు వర్షాలు కొనసాగితే నాట్లు, నారుమడులు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టెక్కే ప్రాంతవాసులు

ఆత్మకూరు: తమ ప్రాంతంలో విద్యుత్ లైన్‌ను నిర్మించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని పట్టణంలోని 17వ వార్డు టెక్కే ప్రాంతవాసులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలో విద్యుత్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని గతంలో అధికారులకు విన్నవించగా విద్యుత్ స్తంభాలను నాటి తీగలను లాగలేదని తెలిపారు. విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం నాయకుడు డేవిడ్ రాజు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి వేడుకలు



సీతారామపురం శివాలయంలోని కోనేరులో కార్తీక దీపాలు వదులుతున్న భక్తులు



సీతారామపురం: సిద్దేశ్వరం క్షేత్రంలో సిద్దేశ్వరుడికి అన్నాభిషేకం

సీతారామపురం : కార్తీక మాసం ముగింపు సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాల్లో సోమవారం పోలి పాడ్యమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సిద్దేశ్వరం క్షేత్రంలో సిద్దేశ్వరుడికి అన్నాభిషేకం, విశేష పూజలు జరిపారు. సీతారామపురంలోని శివాలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. పోలి పాడ్యమి రోజున అరటి దొప్పల్లో కార్తీక దీపాలను వెలిగించి నీటిలో వదిలితే స్వర్గం ప్రాప్తిస్తుందనే నమ్మకంతో మహిళలు కోనేరులో వాటిని వదిలారు.

వరికుంటపాడు: కార్తీక మాసం ముగింపు సందర్భంగా మండలంలోని శివాలయాల్లో పోలి పాడ్యమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు, రామాపురం, పామూరుపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో వేకువజామునే విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయాల సమీపంలోని నీటి వనరుల్లో భక్తులు అరటిదొప్పల్లో వెలిగించిన కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శివాలయాలకు వెళ్ల లేని వారు ఇంటి ఆవరణలోని తులసి చెట్టు వద్ద పాత్రల్లో నీరుపోసి దీపాలను వదలిపెట్టారు.

## పూడికతీత చేపట్టాలని వినతి



పిచ్చిచెట్లతో నిండిన ఎడమ కాలువ

వరికుంటపాడు: మండలంలోని నక్కలగండి ప్రాజెక్ట్ పరిధిలోని కుడి, ఎడమ కాలువల్లో పిచ్చిచెట్లు మొలిచి సాగునీరు సజావుగా వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. నక్కలగండి ప్రాజెక్ట్ కింద 1200 ఎకరాల ఆయకట్టు ఉంది. ఎడమ కాలువ ద్వారా వేంపాడు, తిమ్మారెడ్డిపల్లె, రామాపురం, కాకొల్లువారిపల్లె, భోగ్యంవారిపల్లె, వెంగమాంబపురం, అశోక్‌నగర్, తదితర గ్రామాల్లోని వేయి ఎకరాలకు సాగునీరు అందుతుంది. అలాగే కుడి కాలువ కింద ప్రకాశం జిల్లా పామూరు మండలం జంగాలపల్లి, కోడిగుడ్లపాడు గ్రామాల్లో 200 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. ప్రాజెక్ట్‌లో సాగునీరున్నా కాలువల్లో పిచ్చిచెట్లు పెరగడంతో సాగునీరు సజావుగా అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు, జల వనరుల శాఖ అధికారులు స్పందించి పిచిచెట్లను తొలగించి పూడికతీత పనులు రైతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ఆత్మకూరులో భారీ వర్షం



మర్రిపాడు: ఉరుస్తున్న పడమటినాయుడుపల్లె సచివాలయ భవనం

ఆత్మకూరు: పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. తుపాన్ ప్రభావంతో మూడ్రోజులుగా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిల్వ చేరడంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు అవస్థ పడ్డారు. కాగా ఆత్మకూరు డివిజన్ పరిధిలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 138.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆత్మకూరు 6.8, సంగం 25.8, మర్రిపాడు 4.6, చేజర్ల 14.6, అనంతసాగరం 36.4, ఏఎస్‌పేట 12, సీతారామపురం 2.2, ఉదయగిరి 15.4, కలువాయి 21 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

సంగం: మండలంలో సోమవారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. గత రెండు రోజులుగా వర్షం పడుతూనే ఉండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మర్రిపాడు: మండలంలో సోమవారం కూడా వర్షం కురిసింది. వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కాగా పడమటినాయుడుపల్లిలోని సచివాలయ భవనం శిథిలావస్థకు చేరుకుని మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉరుస్తోంది. దీంతో విలువైన కంప్యూటర్లు, రికార్డులను కాపాడుకునేందుకు సచివాలయ సిబ్బంది నానాపాట్లు పడుతున్నారు.

చేజర్ల: మండలంలో పెరుమాళ్లపాడు, గొల్లపల్లి, తూర్పుపల్లి, ఆదూరుపల్లి, చేజర్ల, పెళ్లేరు, టీకేపాడు తదితర గ్రామాల్లో సోమవారం కూడా ఓ మోస్తరుగా వర్షం కురిసింది. తుపాన్ ప్రభావంతో మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు రబీ సాగు పనులను ముమ్మరం చేశారు. కాగా మినుము, పెసర, జొన్న, తదితర మెట్ట పంటలకు వర్షం మేలు చేకూర్చిందని రైతులు తెలిపారు.

కావలి: పట్టణంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ట్రంకురోడ్డుపై నీరు నిలవడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



కావలిలో ట్రంకురోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



సంగంలో జోరుగా కురుస్తున్న వర్షం



ఆత్మకూరులో..

## జీఓ నంబర్ 73ను అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సోమశిల(ఆత్మకూరు): ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీఓ 73 మేరకు వ్యవసాయ కూలీలకు కూలి లభించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు అనంతసాగరం తహసీల్దార్ సుభాషిణికి సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ రంగంలో యంత్రాలు వాడకం పెరగడంతో పనుల్లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. ఈ నేపథ్యంలో కూలి పెంచేలా ప్రభుత్వం జారీ చేసిన జీఓ 73ను అమలు చేయాలని వారు కోరారు. సీపీఎం కార్యవర్గ సభ్యులు మంగళి పుల్లయ్య, అన్వర్‌బాషా, జక్రయ్య, శ్రీనివాసులు, మీరామొహిద్దీన్, వెంకటేష్, అంకయ్య, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

### పెన్నా తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సంగం: సంగం బ్యారేజ్ నుంచి దిగువకు ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు సోమ్లానాయక్, సీఐ వేమారెడ్డి సూచించారు. ఈ మేరకు పెన్నాతీర గ్రామాల్లో సోమవారం దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్నానదిలోకి వెళ్లవద్దని మత్స్యకారులు, పశువుల కాపరులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

### విద్యుత్‌షాక్‌తో గేదె మృతి



వరికుంటపాడు: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన వరికుంటపాడులో సోమవారం చోటు చేసుకుంది. గ్రామంలోని రామాలయం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచెలేదు. దాసరి రమణమ్మకు చెందిన గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెరిగి ఉన్న పచ్చగెట్లను తినేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.విద్యుత్ అధికారులు స్పందించి తగిన పరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలు వేడుకున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే గేదె మృతి చెందిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

### గ్రీవెన్స్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ఆత్మకూరు: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని అధికారులను ఆదేశించారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 20కుపైగా అర్జీలు వివిధ సమస్యలపై అందినట్లు ఆర్డీఓ తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్జీలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని ఆదేశించారు.

### అడుగడుగునా గుంతలే



ఆత్మకూరు: పట్టణంలోని పడమరవీధి నుంచి టెక్కే ప్రాంతానికి వెళ్లే రహదారి దారుణంగా ఉంది. ఈ మార్గంలో టెక్కే, ఏసీఎస్ఆర్‌కాలనీ, వందూరుగుంట, జమ్మలపాళెం ప్రాంతాల ప్రజలతో పాటు సుమారు రెండు వేల ఎకరాలకు సంబంధించిన రైతులు వెళ్తుంటారు. రోడ్డు అడుగడుగునా గుంతలతో నిండడం ..మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ చేరడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. గుంతలు లేని రోడ్లను ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు ముందు ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు విస్మరించడంపై ప్రజలు మండిపడుతున్నారు.

### వర్షం పడితే ఉరుపే





ఆత్మకూరురూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. వర్షం పడితే ఉరుస్తోంది. గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు కార్యాలయంలోని రికార్డులు, కంప్యూటర్లను భద్రపరించేందుకు రెవెన్యూ సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. దీనికితోడు తహసీల్దార్ కార్యాలయం ముందు అర్జీదారులు కూర్చునే ప్రాంగణం కూడా చిత్తడిగా మారింది. దీంతో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చి న అర్జీదారులు ఉండేందుకు ఇబ్బందులు పడ్డారు.